బాలలకు సీఎం శుభాకాంక్షలు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సీఎం నివాళులు అర్పించారు. 'నేటి బాలబాలికలే భావి భారత పౌరులు' అని విశ్వసించి, ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

నేడు ఎంప్లాయీస్ జేఏసీ నిరసనలు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలకు తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ పిలుపునిచ్చింది. ఉద్యోగ సంఘాల జేఏసీ అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ గురువారం ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

క్రిస్మస్ వేడుకల నిర్వహణకు కమిటీలు

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): క్రిస్మస్ వేడుకల నిర్వహణపై రాష్ట్రస్థాయి కమిటీతో పాటు ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే వేడుకలకు సంబంధించి కమిటీలు త్వరగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ పురస్కరించుకొని ప్రజా ప్రభుత్వం నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు నిర్వహణ, కమిటీలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జీహెచ్ఎంసీలో కూడా వేడుకల నిర్వహణకు కమిటీలు వేయాలని చెప్పారు. సమావేశంలో మైనార్టీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ తాప్సీద్ ఇక్బాల్, మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్ యాస్మిన్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ సబిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

మళ్లీ మొదటికి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ

20 నుంచి మరోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. అన్ని జిల్లాల్లో కలిపి 90 వరకు స్పోర్ట్స్ కోటా పోస్టులున్నాయి. జీవో-74 ప్రకారం అన్ని అర్హతలున్న 33 మందికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలిచ్చారు. మిగిలిన పోస్టులను నాన్ స్పోర్ట్స్ కోటాలో జనరల్ అభ్యర్థులతో భర్తీచేశారు. దీంతో చాలా మంది అభ్యర్థులు తమకు అన్ని రకాల అర్హతలున్నాయని, అవకాశం కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. కొంత మంది స్పోర్ట్స్ సర్టిఫికెట్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదులుచేశారు. దీంతో అభ్యర్థులందరి సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా 393 మంది స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు 20 నుంచి 22 వరకు మరోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ దోమల్‌గూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి సూచించారు. పెద్దపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా 31జిల్లాల్లోని పీఈటీ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్ జిల్లాలో 20 మంది ఫలితాలు విత్‌హెల్డ్‌లో పెట్టారు.

ముగిసిన 'మైటా' దశాబ్ది ఉత్సవాలు

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ) : ఈ నెల 9న ప్రారంభమైన మలేషియా తెలంగాణ అసోసియేషన్(మైటా) దశాబ్ది ఉత్సవాలు బుధవారం ముగిశాయి. అసోసియేషన్ ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేషియాలో వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతిగాంచిన వారిని అవార్డులతో సత్కరించారు. ప్రెసిడెంట్ సైదం తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ చిరుత చిట్టిబాబు, మహిళా ప్రెసిడెంట్ కిరణ్మయి, జనరల్ సెక్రటరీ సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

సాంచాలపై సావు సప్పళ్లు

- సిరిసిల్లలో నేతన్నల మృత్యుఘోష
- ఉరితాళ్లు పేనుతున్న వస్త్ర పరిశ్రమ
- కొనసాగుతున్న కార్మికుల ఆత్మహత్యలు
- 11 నెలల్లో 13 మంది బలవన్మరణం
- కాంగ్రెస్ పాలనలో పథకాలన్నీ బంద్
- బతుకమ్మ చీరలు సహా ఇతర ఆర్డర్లు లేక మూతపడిన టెక్స్‌టైల్ పార్కు
- ఉపాధి కరువై రోడ్డునపడ్డ నేతన్నల కుటుంబాలు
- సిరిశాలలో మళ్లీ పదేండ్ల కింది పరిస్థితులు

హైదరాబాద్/రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల సాంచాలపై సావు సప్పుళ్లు మోగుతున్నాయి. బట్టలు నేసే నేతలన్నల చేతులు మళ్లీ ఉరితాళ్లు పేనుకుంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో బతుకులు ఆగమై.. ఉరులకు చిరునామాగా మారిన సిరిశాల, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త ఊపిరి పోసుకున్నా.. 'మార్పు' అంటూ వచ్చిన కాంగ్రెస్ సర్కారులో మళ్లీ 'ఉరి'శాలగా మారుతున్నది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సర్కారు బతుకమ్మ చీరలతో నేతన్నల బతుకులకు కల్పించిన భరోసాను, మలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు రాగానే చెరిపేసి 11 నెలల్లో 13 మంది ఉసురు తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సాంచాలు మూతపడి ఉపాధి కరువై.. బతుకు బరువై నేతన్నల కుటుంబాలు తిరిగి రోడ్డునపడ్డాయి. నిన్నమొన్నటిదాకా చిరునవ్వులు చిందిన చేనేతల ముఖాల్లో ఇప్పుడు కుటుంబాలను పోషించుకోలేని నిస్సహాయ స్థితిలో కారుతున్న కన్నీళ్లే కనిపిస్తున్నాయి.

బతుకు భరోసా కల్పించిన కేసీఆర్

ఉమ్మడి పాలనలో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వంలో చేనేత, పవర్‌లూమ్ కార్మికులు దాదాపు 600 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారు. 'నేతన్నా.. ఆత్మహత్య చేసుకోకు.. కుటుంబాలను రోడ్డున పడేయద్దు' అంటూ నాడు గోడల మీద పోలీసులు రాసిన రాతలు చూసి తెలంగాణ ఉద్యమ కాలంలో సిరిసిల్లకు వచ్చిన కేసీఆర్ చలించి పోయారు. తెలంగాణ వచ్చిన వెంటనే సీఎం హోదాలో రూ.50 లక్షలు పద్మశాలీ ట్రస్టుకు అందజేసి వారిని అప్పుల ఊబి నుంచి కొంత బయటకు తెచ్చారు. నేతన్నల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ప్రత్యేకంగా బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలు అప్పజెప్పి పవర్‌లూమ్ కార్మికులను ఆదుకున్నారు. ఏడాదికి దాదాపు రూ.300 కోట్లతో బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చారు. కొనసాగింపుగా రూ.5 లక్షల వరకు నేతన్న బీమా పథకాన్ని ప్రవేశ పెట్టారు. రూపాయి ప్రీమియం చెల్లించకున్నా నేత కార్మికులకు బీమా వర్తింపచేశారు. ఉమ్మడి పాలనలో వలసబాట పట్టిన కార్మికులంతా కేసీఆర్ చూపిన బతుకు బాటతో తిరిగి వచ్చి కుటుంబాలతో సంతోషంగా కలిసి జీవించారు. నెలకు రూ.20 వేల వరకు ఇక్కడే సంపాదించడంతో ఆర్థిక భరోసా లభించింది. ఒక్క సిరిసిల్ల కార్మికులే కాదు.. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి పొట్ట చేత పట్టుకుని వలస వచ్చిన కార్మికులు వందల సంఖ్యలో జీవనోపాధి పొందారు.

మళ్లీ పాత రోజులు

సమైక్య పాలనలో సిరిసిల్ల నేతన్నలకు కనీసం అప్పు పుట్టని పరిస్థితి ఉండేది. మైక్రో ఫైనాన్స్‌లు, షేర్‌ముల్లా లాంటి వాటిని ఆశ్రయించి అప్పులు తీసుకొని వడ్డీలు కట్టలేక భార్య మెడలోని మంగళసూత్రాలు సైతం అమ్ముకున్న దీన స్థితి ఉండేది. ఓవైపు ఉపాధి లేక, మరోవైపు కుటుంబ పోషణ భారమై అప్పులు చెల్లించక లేక వందల సంఖ్యలో కార్మికులు నూలు పోగులనే ఉరితాళ్లుగా పేనుకుని బలవన్మరణాలకు పాల్పడ్డారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు సిరిసిల్లలో పరిస్థితి ఎలా ఉండేదో ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ అలాంటి రోజులే వచ్చాయి. మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. మార్పు అంటూ ఆశలు పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను గాలికివదిలేసింది. వర్క్ ఆర్డర్లు ఇవ్వక పోవడంతో వేలాది సాంచాలు మూతపడి పనుల్లేక కార్మికులు రోడ్డున పడ్డారు. 11 నెలల్లో 13 మంది ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 30 వేల పైచిలు మరమగ్గాలున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ ఆదరణ లేక 2000కు పైగా సాంచాలను తుక్కుకింద అమ్ముకున్న దుస్థితి దాపురించింది. రాష్ట్రంలోనే తొలి టెక్స్‌టైల్స్ పార్కు మూతపడింది. కరెంటు బిల్లులు కూడా కట్టలేక యజమానులంతా యూనిట్లను మూసివేసి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

రూ.కోటి కూడా దాటని కాంగ్రెస్ సర్కార్ ఆర్డర్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్ల మరమగ్గాలకు యూనిఫాంల తయారీ కోసం రూ.48.69 లక్షలు, టెక్స్‌టైల్స్ పార్కులోని మరమగ్గాలకు రూ.49.94 లక్షల వర్క్ ఆర్డర్లు ఇచ్చింది. అవి కూడా రూ.కోటి దాటక పోవడం గమనార్హం. మంజూరు చేసిన యారన్‌బ్యాంకు వేములవాడలో ఏర్పాటు చేయడంపై వ్యాపారుల్లో నిరసన వ్యక్తమవుతున్నది. మహిళా సంఘాలకు నాలుగు చీరల చొప్పున ఇస్తామని ఊరించడే తప్ప, ఇప్పటివరకు అతీగతీ లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం 'వర్కర్ టు ఓనర్' పథకం కింద నిర్మించిన షెడ్లను ఈ ప్రభుత్వం ప్రారంభించకుండా వదిలేసింది. వాటిని ఇతర గోదాములకు ఇచ్చింది.

బీఆర్ఎస్ సర్కార్ అమలు చేసిన పథకాలు

- నేతన్నలకు రూ.లక్ష రుణమాఫీ
- బతుకమ్మ చీరెలు, క్రిస్మస్, రంజాన్, విద్యార్థుల యూనిఫాం, కేసీఆర్ కిట్లు మొత్తం సుమారు రూ.3 వేల కోట్ల ఆర్డర్లు
- మరమగ్గాల ఆధునీకరణ
- మరమగ్గాల మేళా

సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న కార్మికుల వివరాలు

కార్మికుని పేరు	ఆత్మహత్య చేసుకున్న తేదీ
తడుక శ్రీనివాస్	2024, ఫిబ్రవరి 11
సిరిపురం లక్ష్మీనారాయణ	2024, ఏప్రిల్ 6
అంకారపు మల్లేశం (తంగళ్లపల్లి)	2024, ఏప్రిల్ 25
అడిశర్ల సాయికుమార్	2024, ఏప్రిల్ 25
కుడిక్యాల నాగరాజు	2024, జూన్ 21
ముబికొండ నరేశ్	2024, జూన్ 25
గూడూరి విష్ణుప్రసాద్	2024, జూలై 1
పల్లె యాదగిరి	2024, జూలై 2
జక్కని సతీశ్	2024, ఆగస్టు 27
ఆడెపు సంపత్	2024, అక్టోబర్ 19
బైరి అమర్	2024, నవంబర్ 9
బైరి స్రవంతి	2024, నవంబర్ 9
ఎర్రం కొమురయ్య	2024, నవంబర్ 13

బీఆర్ఎస్ హయాంలో	కాంగ్రెస్ పాలనలో
నేతన్నకు బీమా	బంద్
నేతన్నకు చేయూత	బంద్
త్రిఫ్ట్ (పొదుపు)	బంద్
50 ఏండ్లకే పింఛన్	అమలు
బతుకమ్మ చీరెలు వర్కర్ టు ఓనర్ పథకంలో	
బంద్ (రూ.100 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నది)	
వర్క్ షెడ్లు కట్టించింది	ఇంకా ప్రారంభించలేదు, షెడ్లు గోదాములకు ఇచ్చింది
మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ	
బంద్ (రూ.30 కోట్ల సబ్సిడీ బకాయిలు విడుదల చేయలేదు)	

కేసీఆర్ ఉంటే ఆకలి చావులు ఉండకపోవు

11 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క సిరిసిల్లలోనే 13 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి సర్కారే బాధ్యత వహించాలి. గత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్, పిల్లల డ్రెస్‌లు, కేసీఆర్ కిట్లు ఇలా ప్రతి ఒక్క ఆర్డర్లు సిరిసిల్లకే ఇచ్చి కార్మికులకు చేతి నిండా పని కల్పించింది. ఆయన అధికారంలో ఉండిఉంటే కార్మికుల ఆకలి చావులు జరిగేవి కావు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలి. లేదంటే వేలాది మంది కార్మికులతో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం.

– మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

కార్మికులకు శాపంగా కాంగ్రెస్

కాంగ్రెస్ వచ్చాక చేనేత, మరమగ్గాల కార్మికులు ఉపాధి లేక, అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతూ చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ముండి వైఖరి, ప్రస్తుత విధానాలు చేనేత కార్మికుల పాలిట శాపాలుగా మారినయ్. బతుకమ్మ చీరల రద్దుతో ఒక్కసారిగా పవర్‌లూమ్ కార్మికులు ఉపాధి లేక కుప్ప కూలిపోయారు.

–కూరపాటి రమేశ్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర నాయకుడు

సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకున్న కొమురయ్య

కొమురయ్య (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఉపాధి కరువై.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరో నేత కార్మికుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఎర్రం కొమురయ్య (55) సాంచాలు నడిపేవాడు. కొమురయ్యకు భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయికిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు. కూతురు, పెద్దకొడుకు పెండ్లిళ్లకు అప్పుచేశాడు. చిన్న కొడుకు పెండ్లి చేయాలనుకొని ఉన్న ఇంటి మరమ్మతులకు కలిపి మొత్తం రూ.10 లక్షల దాకా అప్పుచేశాడు. బతుకమ్మ చీరలతో నెలకు రూ.20 వేలు సంపాదిస్తూ చేసిన అప్పులు తీర్చాలనుకున్నాడు. ఈ క్రమంలో చీరల ఆర్డర్లు బంద్ కావడం, వస్త్ర పరిశ్రమ మూసేయడంతో ఉపాధి నిలిచిపోయింది. పది నెలలుగా పనుల్లేక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కొమురయ్య గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన నేతన్న బీమా పథకంలో పేరు నమోదు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రియురాలిని హత్య చేసి..! పత్తి చేనులో పూడ్చి..

గ్రామస్థుల అనుమానంతో వెలికితీసిన పోలీసులు

మృతురాలు స్వాతి, నిందితుడు వీరభద్రం (ఫైల్)

జూలూరుపాడు, నవంబర్ 13: ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన యువకుడు తన పత్తి చేనులో పూడ్చిపెట్టాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్థుల ద్వారా విషయం బయటకు రావడంతో నిందితుడు వీరభద్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మాచినేనిపేట తండాకు చెందిన వీరభద్రం, స్వాతి (33) ఇద్దరూ చాలా ఏండ్లుగా సహజీవనం చేస్తున్నారు. గతంలో సింగరేణి సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ జంట నుంచి రూ.16 లక్షలు తీసుకున్న విషయంలో స్వాతి, వీరభద్రం ప్రధాన సూత్రధారులు. వారికి ఉద్యోగం రాకపోవడంతో మోసపోయిన సదరు దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ జంట వద్ద తీసుకున్న రూ.16 లక్షల విషయంలో స్వాతి, వీరభద్రం మధ్య విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలోనే స్వాతిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో హత్య చేసినట్టు పలువురు చెప్పుకుంటున్నారు. బుధవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ స్వాతిబిందు, ఆర్ఐ తిరుపతిరావు గ్రామాన్ని సందర్శించి పాతిపెట్టిన ప్రాంతం నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు.

24న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

హాల్‌టికెట్లు విడుదల చేసిన ఎస్సెస్సీబోర్డు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఈ నెల 24న ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే వారి హాల్‌టికెట్లను అధికారులు బుధవారం విడుదల చేశారు. ఆయా హాల్‌టికెట్లను https //bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. అభ్యర్థులు తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఆధారంగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

రాష్ట్ర బీజేపీలో కొత్త చిచ్చు

- లోక్‌సభ టికెట్ల ఆశచూపి పలువురి నుంచి భూములు, డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- వివాదంలో ముగ్గురు నేతలు!
- తీరా టికెట్లు వేరేవారికి కేటాయింపు
- బదులుగా ఎమ్మెల్సీ టిక్కెట్ల కోసం ఆ వ్యాపారవేత్తల ఒత్తిడి
- అధిష్ఠానానికి చేరిన పంచాయితీ
- నిలిచియున టికెట్ల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బీజేపీలో కొత్త చిచ్చు పుట్టింది. ఎమ్మెల్సీ టిక్కెట్ల కేటాయింపుపై రచ్చ ఢిల్లీకి చేరింది. దీంతో టిక్కెట్ల కేటాయింపు ఆగిపోయినట్టు ప్రచారం జరుగుతున్నది. లోక్‌సభ ఎన్నికల సమయంలో మల్కాజిగిరి, మెదక్ ఎంపీ సీట్లు ఇస్తామంటూ కొందరు వ్యాపారవేత్తల నుంచి ముగ్గురు కీలక నేతలు వసూళ్లకు పాల్పడినట్టు రాజకీయవర్గాల్లో చెప్పుకుంటున్నారు. కొంత నగదు రూపంలో, మరికొంత భూమి రూపంలో ముడుపులు తీసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. భూములను బినామీల పేరుపై రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని సమాచారం. తీరా టిక్కెట్లను వేరేవారికి కేటాయించారు. దీంతో ఆ వ్యాపారవేత్తలు ముగ్గురు నేతలపై ఒత్తిడి పెంచారని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారట. ఇప్పుడు ఎమ్మెల్సీ టిక్కెట్లను కేటాయించాలని సదరు వ్యాపారవేత్తలు ముగ్గురు నేతలపై ఒత్తిడి తెస్తున్నట్టు బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఆ ముగ్గురు నేతలు కూడా తాము తీసుకున్న డబ్బులకు ప్రతిఫలం ఇచ్చేందుకు నానాతంటాలు పడుతున్నారని తెలుస్తున్నది. ఈ మొత్తం వ్యవహారానికి గతంలో బీజేపీలో రాష్ట్ర స్థాయిలో కీలక పదవిలో పనిచేసిన ఓ నాయకుడు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్టు సమాచారం.

ఢిల్లీకి చేరిన పంచాయితీ

ఎంపీ ఎన్నికల్లో కూడా డబ్బులు ఇచ్చిన వారికి, గెలిచే అవకాశం లేనివారికి టిక్కెట్లు కేటాయించారని బీజేపీలో కొందరు లీడర్లు గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది. పార్టీ కోసం కష్టపడ్డవారికి కనీసం ఎమ్మెల్సీ టిక్కెట్లు అయినా ఇవ్వాలని కొన్నాళ్లుగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. కానీ కొత్తగా తెరమీదికి వచ్చిన పేర్లు కమలదళంలో కొత్తచిక్కులకు కారణమయ్యాయి. పార్టీకి చెందిన సీనియర్లు ఈ విషయాన్ని ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఢిల్లీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ టిక్కెట్ల కేటాయింపును తాత్కాలికంగా పక్కన పెట్టినట్టు చర్చ నడుస్తున్నది. ఎవరెవరు ఎంతెంత తీసుకున్నారో తేల్చేందుకు అంతర్గత విచారణకు కూడా ఆదేశించినట్టు సమాచారం. ఈ పరిణామాలతో టికెట్లు ఎవరికి దక్కుతాయి? అనేదానిపై పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది.

ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్

- తోటి ఉద్యోగి నుంచి రూ.15వేలు లంచం తీసుకున్న షాకీర్‌ఖాన్

ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్

నిర్మల్ అర్బన్, నవంబర్ 13: నిర్మల్ జిల్లా కేంద్రంలోని నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి బుధవారం వివరాలు వెల్లడించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వాచ్‌మన్‌గా పనిచేసే బందెన్న కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుమారుడు భరత్‌ను 3 నెలల క్రితం బిల్ కలెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి సర్వీస్ బుక్‌లో తన పేరును ఎంట్రీ చేయాలని ఇన్‌చార్జి ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్‌కు భరత్ విన్నవించాడు. రెండు నెలలు తిప్పుకున్నా ఎంట్రీ చేయలేదు. పైగా రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరికి రూ.15 వేలు ఇస్తానని అంగీకరించాడు. ఈ విషయమై భరత్ ఈ నెల 10న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం.. బుధవారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో రూ.15 నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వీరి వెంట సీఐలు కృష్ణకుమార్, కిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

కార్తీక పౌర్ణమికి ఆర్టీసీలో సవరించిన చార్జీలు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో చార్జీలను సవరించారు. హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల నుంచి నడిచే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ముందస్తు రిజర్వేషన్‌కు tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు 040-69440000, 040-23450033 నంబర్లకు ఫోన్ చేయొచ్చు.

వ్యక్తిగత వివరాల సేకరణ తగదు

- తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్,నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో ఆస్తులు, రాజకీయ, వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలు ఎందుకని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. వ్యక్తిగత వివరాలను ఇవ్వడానికి ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అటువంటి ప్రశ్నలను తొలగించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత ప్రశ్నలకు సంబంధించిన వివరాలు వెల్లడించే క్రమంలో కొన్ని చోట్ల ప్రజలు ఎన్యుమేటర్లపై దాడులు చేస్తున్నారని వాపోయారు. రేషన్ కార్డులు తొలగించడానికి, సంక్షేమ పథకాలు రద్దు చేయడానికే సర్వే చేస్తున్నారని ప్రజల్లో సందేహాలు రేకెత్తుతున్నాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, అఖిలపక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేసి, సర్వే సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తమ్మినేని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లు.. నిరంతర ప్రక్రియ

400చదరపు అడుగుల్లోనే ఇల్లు కట్టుకోవాలి: పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ముఖాముఖి, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఎక్కువ దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల గురించే వచ్చాయన్నారు. మొదటి విడతగా 4 నుంచి 5 లక్షలు ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఏటా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. 400 చదరపు అడుగు